# అదిగో పులి

– మల్లాది వెంకట కృష్ణమూర్తి



## (గత సంచిక తరువాయి)

**పార్టీ అయాక అంతా కార్లలో బయలుదేరారు.** బీర్ అంటే ఇష్టం అయిన కబీర్ సింగ్ అందరికన్నా చివర బయలుదేరాడు. హీరాలాల్ అతనికి గుడ్‌నైట్ చెప్పి తన కారువైపు నడిచాడు. అతను తూలడం గుర్తించిన హీరాలాల్ అడిగాడు.

"డ్రయివర్ ఉన్నాడు. మీ వెంట పంపనా?"

"అక్కర్లేదు. బీర్ కే ఇదయితే ఎలా?"

కబీర్ సింగ్ కారుని గేటులోంచి రోడ్డుమీదకి పోనిచ్చేప్పుడు తెలిసింది తనకి బీర్ బాగా ఎక్కిందని. రోడ్డుకి కుడివైపు పూర్తిగా కారు తిప్పలేక, కొద్దిగా రివర్స్ చేసి మళ్ళీ పోనిచ్చాడు.

ఒకటి రెండుసార్లు స్టీరింగ్ కంట్రోలు తప్పి పక్కకి వెళ్ళడం.. అలర్ట్‌గా కూర్చునే డ్రయివ్ చేయసాగాడు కబీర్ సింగ్.

రోడ్డుపక్కన ఉన్న పెద్ద కొండరాతి మీదనుంచి గంభీరంగా కిందకి దిగింది చీతా, ఎదురుగా ఉన్నమరో కొండరాయిమీదకి ఎక్కాలనే ఉద్దేశంతో.

కబీర్ సింగ్ కారు కూడా అదే సమయంలో నిశ్శబ్దంగా రోడ్డుమలుపు తిరిగింది.

కళ్ళు మూసి తెరిచేలోగా ఆ చిరుతపులికి కారు బంపర్ బలంగా తాకడం, ఎగిరెళ్ళి రోడ్డుకి పక్కగా అది పడటం, కబీర్ సింగ్ కారుని ఆపడం వెంట వెంటనే జరిగిపోయాయి.

కారుని రివర్స్‌లో నెమ్మదిగా వెనక్కి పోనిచ్చాడు కబీర్ అది పడ్డచోటికి. కొద్దిసేపు నిశ్శబ్దంగా చూస్తూండిపోయాడు కదలకుండా పడివున్న దానివంక. దాని కళ్ళలోంచి, కడుపులోంచి రక్తం కారుతోంది.

ఇంకా బతికే ఉంది.

కారు దిగకుండా గట్టిగా హారన్ కొట్టసాగాడు. రోడ్డుపక్క ఇంట్లోంచి గూర్ఖా వచ్చి చూసి, పదిమందిని పిలుచుకు వచ్చేసరికే దానిలో చలనం ఆగిపోయింది.

"ఎలా జరిగింది?" అడిగారాయనని అంతా.

కబీర్ సింగ్ కారు దిగి టై సర్దుకుని చెప్పాడు. అప్పటికే ఏం చెప్పాలో ఆలోచించుకున్నాడు.

"కారులో వస్తున్నాను. దూరంగా రోడ్డు ప్రక్కగా అది నిలబడి ఉంది. నా కారుని చూసి ఆగింది. నేనూ కారాపేశాను. కానీ ఇంజన్ ఆపలేదు. అకస్మాత్తుగా అది రోడ్డు దాటే ప్రయత్నం చేస్తూంటే నేను వెంటనే కారు దానిమీదకి పోనిచ్చాను. తప్పించుకుందామనుకుంది కానీ నేను డ్రయివింగ్ లో ఎక్స్‌పర్ట్‌ని కదా."

"యు ఆర్ రియల్లీ బ్రేవ్"

"అండ్ రిసోర్స్ ఫుల్ ఆల్సో."

"కంగ్రాచ్యులేషన్స్"

అందరూ అభినందిస్తూ ఆయనతో కరచాలనం చేస్తుంటే చిరునవ్వుతో, "థాంక్స్" చెప్పాడు అందరికి.

సాధారణంగా మలుపు తిప్పేటప్పుడు హారన్ కొడతాను. కానీ ఇవాళ అలా చేయలేదు. స్లో కూడా చేయలేదు. చిరుతపులి కాబట్టి సరిపోయింది. అదే ఏ మనిషో రోడ్డు దాటుతూవుంటే అనుకున్నాడు భయంగా.

అరగంట తర్వాత పోలీస్ కమీషనర్ కారు, పత్రికా విలేఖర్లు, ఫోటో గ్రాఫర్లు మొదలయిన వాళ్ళంతా ఒకరి తర్వాత ఒకరు ఆ ప్రదేశానికి చేరుకున్నారు. అప్పటికి కబీర్‌కి కొంత మత్తుదిగింది. స్టడీ అయాడు.

కబీర్ సింగ్‌ని, మరణించిన పులిని కలిసి ఫోటోలు తీశారు, కారుతో. తమ దినపత్రికల కోసం ఇంటర్వ్యూ చేసారు. అనేక ప్రశ్నలు వేసారు ఆయన్ని రఘుపతితో సహా అందరూ.

రఘుపతి ఓ ఇంట్లోంచి ఫోన్ చేసి చెప్పాడు నెహ్రూ జులాజికల్ పార్క్ డైరెక్టర్‌కి. ఆయన బాధగా కళ్ళు మూసుకున్నాడు. చిరుతపులి మరణించిన సంగతి తెలియగానే.

"ఎలా? ఎవరు? ఎప్పుడు? ఎక్కడ?" లాంటి ప్రశ్నలేం అడగలేదాయన రఘుపతి సంగతి తెలియగానే.

దాని వర్ణన విని అది చీతాగా గుర్తించాడు.

"ప్రపంచంలోంచి ఓ చీతా తక్కువైంది" అన్నాడాయన దీర్ఘంగా శ్వాస వదిలి.

అది వినగానే ఆయన భార్య ఓదార్పుగా భండార్కర్ భుజం మీద తన చేతిని వేసింది.

చాలాసేపు మౌనంగా ఉండిపోయాడాయన. ఏదో ఆలోచన వచ్చిందానిలా చటుక్కున లేచి వెళ్ళి ఆయన స్టాంప్స్ ఆల్బం, పిక్చర్ పోస్ట్ కార్డ్స్ కబోర్డులోంచి తీసుకువచ్చి ఆయన ముందు పెట్టింది.

ఆ ఇంట్లోని ప్రియమైన వస్తువులలో ఆయనకి అవి ముఖ్యమయినవి స్టాంప్స్ ఆల్బంలో వివిధ దేశాల్లో వైల్డ్ లైఫ్ మీద విడుదల చేసిన ప్రత్యేక తపాలా బిళ్ళలు అతికించబడి ఉన్నాయి.

జంతువులు, పక్షులు, జలచరాలు మొదలయినవాటి బొమ్మలు ఆ స్టాంపుల మీద వివిధ ర్మగుల్లో ముద్రింపబడి ఉన్నాయి.

పిక్చర్ పోస్ట్ కార్డ్స్‌లో కూడా అలాంటి బొమ్మలున్నవే సేకరించి ఆల్బంలో వాటిని ఫోటో కార్నర్స్‌తో అతికిస్తున్నాడు. దాదాపు వెయ్యి కార్డ్స్ దాకా ఉన్నాయి.

మనసు చికాకుగా ఉన్నప్పుడు వాటిని చూస్తూంటే ఆయనకి ఇతర ఆలోచనలు రావు. ఆ సంగతి ఆవిడకి తెలుసు.

పదినిమిషాల్లో భండార్కర్ వాటిలో మునిగిపోయాడు.

## 9

బుధవారం సాయంత్రం ఆరున్నరకల్లా జంటనగరాల్లోని పౌరులందరికీ చిరుత పులుల ప్రమాదం గురించి పూర్తిగా తెలిసిపోయింది. నగరం మొత్తం అట్టుడికిపోయినట్లు ఉడికిపోయింది భయంతో.

ప్రతీ ప్రభుత్వ ఆఫీసులో ఎవరో ఒకరు చిరుత పులిని చూసిన వాళ్ళని చూడటమో, దానిచేత గాయపడ్డ వాళ్ళని గురించి వినడమో జరగటం వల్ల ఆఫీసులో పనులు మానేసి వాటి గురించి చర్చించసాగారు. చాలామంది సగంరోజు సెలవు పెట్టి ఇళ్ళకి వెళ్ళిపోయారు. బేంక్‌ల లాంటి కార్యాలయాల్లో సగం రోజు శెలవు మంజూరు చెయ్యరు కాబట్టి అలాంటి ఆఫీసుల్లో ముళ్ళమీదున్నట్లుగా ఉండిపోయారు స్టాఫ్.

చాలా కార్యాలయాలు నాలుగింటికి మూసేశారు ఆ రోజు. సైకిళ్ళ మీద వంటరిగా వచ్చి వెళ్ళేవాళ్ళు కూడా ఎవరినయినా ఎక్కించుకుని గుంపులుగా వెళ్ళసాగారు ఉళ్ళకి. చిన్న చిన్న ఇరుకు సందులు వదిలేసి మెయిన్ రోడ్లమీదే వెళ్తున్నారు.

చాలామంది ఆడవాళ్ళు భర్తలకోసం ఆఫీసులకి ఫోనులు చేశారు. జంటనగరాల్లో ఇదివరలో ఎన్నడూ మోగనన్ని సార్లు దాదాపు ప్రతీ టెలిఫోన్ మోగుతూనే ఉంది.

మధ్యాహ్నం అయేసరికి వీధులన్నీ నిర్మానుష్యంగా అయిపోయాయి. ఆర్.టి.సి బస్సులు తిరుగుతున్నాయి. పీక్ అవర్స్ దాటగానే డిపోలకు చేరుకునే బస్సులు కూడా రోడ్లమీదే ఉన్నాయి.

తల్లులు పిల్లలని బయటకి వెళ్ళనివ్వడంలేదు. కొందరు పోలీసులు లౌడ్ స్పీకర్స్ గల వేన్స్‌లో తిరుగుతూ హెచ్చరిక చేస్తూండటం వల్ల రాఘవేంద్రనగర్ కాలనీ లాంటిచోట్ల, చిరుతపులులు అనేకమందిని ఎదుర్కొన్న వివిధ ప్రాంతాలలో ప్రజలు భయపడసాగారు.

రేడియోలో ప్రతీ రెండుగంటలకోసారి ప్రజలని భయపడవద్దని వదంతులు నమ్మవద్దనీ, వాటిని ప్రచారం చేయవద్దనీ, క్రూరమృగాల వివరాలు తెలుస్తే వెంటనే పోలీసులకి తెలియజేయవలసిందనీ కోరసాగారు.

పులుల వల్ల కలిగే ప్రమాదాన్ని ఊహించగానే తల్లిదండ్రులు స్కూళ్ళకి వెళ్ళి తమ పిల్లల్ని ఇళ్ళకి మధ్యలోనే తీసుకురాసాగారు. మర్నాడు స్కూళ్ళకి వాళ్ళని పంపదలచుకోలేదు.

జంట నగరాలలోని పోస్ట్ అండ్ టెలిగ్రాఫ్ డిపార్ట్‌మెంట్ దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి – ముఖ్యంగా వరంగల్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, కరీంనగర్, రాజమండ్రిలాంటి ఊళ్ళను నుంచీ బాంబే, కలకత్తా, గౌహతీలాంటి దూరప్రదేశాలనుంచీ కూడా టెలిగ్రాంల తాకిడికి తట్టుకోలేక, సిబ్బందికి శెలవు మంజూరు చేయలేదు.

జంటనగరాలలోని పౌరులకి సంబంధించిన స్నేహితులు, బంధువులు శ్రేయోభిలాషులు దేశం నలుమూలలనుంచీ తమ ఆందోళనని తెలియజేస్తూ, వారి యోగక్షేమాలు వెంటనే తెలియజేయమని కోరుతూ టెలిగ్రాంలు పంపసాగారు. ఎప్పుడూ రానన్ని, వేలకొద్ది టెలిగ్రాంలు వస్తున్నాయి.

టెలిగ్రాములు, వాటి వార్తలను బట్టి, ముఖ్యమయినవి వెంటనే అందజేయాలని సిబ్బందికి సూచనలిచ్చారు.

''ప్లీజ్ సెండ్ వన్ హండ్రెడ్ రూపీస్''

''మదర్ సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ''

''రీచింగ్ హైదరాబాద్ థర్స్‌డే ఫోర్ నూన్. ప్లీజ్ రిసీవ్''

''మాచిరాజు ఎక్స్‌పైర్డ్ స్టార్ట్''

చిరుతపులి సంఘటనకి ఏ మాత్రం వర్తించని ఇలాంటి టెలిగ్రాములు ముందర అందించి ఆ తర్వాతే, 'వైర్ సేఫ్టీ', 'హోప్ ఆ ఆర్ వెల్' లాంటి టెలిగ్రాంలు నెమ్మది మీదట అందచేస్తున్నారు.

అయినా సిబ్బంది చాలటం లేదు.

అదే విధంగా ఇన్‌కమింగ్ ట్రంకాల్స్ కూడా అత్యధికంగా అయ్యాయి.

క్షణం తీరిక దొరకడంలేదు టెలిఫోన్, టెలిగ్రాఫ్ ఆఫీసుల్లోని ఉద్యోగులకి.

కొన్ని దినపత్రికలు సాయంత్రం ప్రత్యేకంగా 'ఈవెనింగ్ ఎడిషన్స్' ప్రచురించాయి. రెండే రెండు పేజీలు గల ఆ పేపర్‌లో పూర్తిగా చిరుత పులులకి సంబంధించిన సమాచారమే ప్రచురించారు.

– క్రూర మృగాలు ఇంతదాకా కనబడ్డ ప్రదేశాలు.

(నగరంలోని వివిధ ప్రాంతాల లిస్టు ఇవ్వబడింది కింద)

- టేక్సీ, ఆటో రిక్షాల డ్రయివర్ల మీటర్ మీద అయిదు రూపాయలు ఎక్కువ అడిగిన సంఘటనలున్నాయి అయిదారుగురు కలసి టేక్సీ షేర్ షేర్ చేసుకుని వెళుతున్నారు.

- గవర్నర్ నగరంలోని విచిత్ర పరిస్థితి పట్ల తమ సానుభూతిని ప్రకటించారు.

- హోటల్స్‌లో భోజనం చేసి గదుల్లో అద్దెకుండే బ్రహ్మచారులు రాత్రిళ్ళు భోజనానికి బయటికి రావడానికి ఇబ్బంది పడుతున్నారు.

రకరకాల వార్తలు ప్రచురించారు ఈవినింగ్ ఎడిషన్‌లో, ఒక ఇంటర్వ్యూలో నెహ్రూ జులాజికల్ పార్కు డైరెక్టర్ చెప్పిన అంశాలని లోపల బాక్స్ కట్టి ప్రకటించిందో దినపత్రిక.

"స్వేచ్ఛగా తిరిగే వన్యమృగాలని జూలపేరుతో బంధించడం వాటిని బాధించటమా?" అన్న ప్రశ్నకి ఆయన సమాధానాన్ని ఆయన ఫోటోతోపాటు ప్రచురించింది.

- కాదు. జంతు ప్రదర్శన శాలల గురించి ప్రజలకి పరిపూర్ణంగా తెలియక పోవటంవల్ల ఇలంటి అపోహ కలుగుతుంది. కేవలం శెలవ రోజుల్లో వారి కాలక్షేపం కోసమే కాదు. వాటివల్ల ఇతర ప్రయోజనాలున్నాయి.

ప్రపంచంలోని అనేక ప్రాంతాలనుంచి సేకరించిన జంతుసంపదని ఓ చోట ఉంచి ప్రదర్శించడాన్ని జులాజికల్ గార్డెన్ అంటారు. క్రమంగా అది జూ అని క్లుప్తంగా వాడుకలోకి వచ్చింది.

పూర్వం ఋషి ఆశ్రమాలు ఒక విధంగా జూలే. అనేక రకాల జంతు, పక్షి సంపదకి ఆశ్రయం రక్షణ కల్పించడం వీటి ముఖ్యోద్దేశ్యంగా ఉండేది.

ఇక రాజులు వారి వినోదం కోసం సొంతంగా జూలు ఏర్పరచుకున్న సందర్భాలు ఉన్నాయి. కృతకాద్రులు (కృత్రిమ పర్వతాలు), కృతక జలాశయాలు ఏర్పరచి అనేక జాతులకు రక్షణ కల్పించడం, పక్షులకు ఆశ్రయం అందించడం జరుగుతూ ఉండేది. పారిజాతాపహరణంలో వీటి వర్ణన ఉంది. ఇవి ఒక విధంగా అభయారణ్యాలే.

ఆధునిక కాలంలో జూలలో జంతు ప్రదర్శన ముఖ్య ఉద్దేశం వాటి అధ్యయనం, శాస్త్రీయ పరిశోధనలు ఇంకా ప్రపంచంలో అనేక అరుదైన జంతువుల జాతి రక్షణకి కూడా నేటి జూలు ఉపయోగిస్తున్నయి.

సాధారణంగా జూలో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలలోని జంతువులని సేకరించి ఆ జంతువులని ప్రజలు చూడడానికి అనువుగా ప్రదర్శిస్తారు. వాటి లక్షణాలు అలవాట్లు చూసి ఆనందిస్తారు. ప్రతి జంతువు గురించి సమాచారం అక్కడ రాసి పెడతారు. ఇదిలా ఉండగా శాస్త్రజ్ఞులకు వాటి అలవాట్లను తెలుసుకోడానికి మంచి అవకాశం కలుగుతుంది. ఎక్కడెక్కడో ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు పోనవసరం లేకుండా వాటిని దగ్గరగా చూసి అధ్యయనం చేసి వాటి జీవన విధానాలు అలవాట్లు తెలుసుకుంటారు.

ప్రత్యుత్పత్తి సందర్భంగా వాటికి సమస్యలు ఏవైనా ఉన్నాయా వాటి ప్రవర్తనా సరళి ఎలా ఉంటుంది మొదలైన విషయాలు తెలుసుకోగల్గుతారు.

అనేక జాతుల పక్షులు, జంతువులు, సరీసృపాలు మానవుడి క్రూరత్వానికి అత్యాశకు బలి అయిపోతున్నాయి. కొన్ని కేవలం వేళ్ళమీద లెక్కించదగిన సంఖ్యలో మిగిలాయి. వాటి సహజ ఆవరణాలు నశింపచేయడంవల్ల, వాతావరణం కాలుష్యం వల్ల అవి రూపు మాసిపోయే ప్రమాదంలో పడ్డాయి. ఇలాటి వాటి ఆదుకుని జూలో పెంచి వాటి సంతానోత్పత్తికి అత్యంత జాగ్రత్తలో కృషిచేయడం జరుగుతోంది.

సైలెంట్ వ్యాలీ (కేరళ)లోని సింహం తోక కోతి (ఎల్‌టిఎం) అమెరికాలో తదితర ప్రాంతాలలో ఎనుము (వైజంట్) అభివృద్ధి చేసి తిరిగి వాటిని సహజ సిద్ధ ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ఈజిప్టులో 2500 బి.సి.లో ఫెరో చక్రవర్తులు తమ దర్పానికి చిహ్నంగా అనేక జంతువులను ఒక చోట చేర్చి ప్రదర్శించుకునేవారు.

గ్రీస్‌లో క్రీ.పూ అయిదవ శతాబ్ధంలో మొదటిసారిగా నిజమైన జూ పార్క్ ఏర్పడిందని అనవచ్చు. ధనవంతులు తమ తమ సొంత జూ పార్క్‌లు ఏర్పరచుకునేవారు.

లండన్ లోని ప్రసిద్ధమైన టవర్ ఆఫ్ లండన్ తో వన్యమృగాల మొదటి సేకరణ ఆధునిక కాలంలో జరిగింది.

1752 జూ పార్కుల చరిత్రలో ఒక మైలురాయి. వియత్నాంలో మొట్టమొదటి జూలాజికల్ గార్డెన్ వెలిసింది. రాజవంశీకుల ప్రవేశానికి మాత్రమే వినియోగించేవారు. 1793లో పారిస్‌లో మరొక జంతుశాస్త్రోద్యానవనం ఆరంభమయింది. 1826లో లండన్ రీజెంట్ పార్క్ జూ మొదలయింది. అలా ప్రపంచ వ్యాప్తంగా ఒకటి ఒకటీ రూపు దిద్దుకోసాగాయి.

1931లో ఇంగ్లండ్‌లో విప్ స్నేడ్ జూ ప్రారంభమయింది. ఇది ఆధునిక జూలకు అంకురార్పణ అనవచ్చు. ప్రతీ జంతువు నివసించడానికి విశాలమైన ప్రాంతం, అనువైన సదుపాయాలు కలుగచేసారు.

భారతదేశంలో లక్నో, కలకత్తా, మైసూర్, తిరువనంతపురం మొదలైన చోట్ల మొదట జూలు ఏర్పడ్డాయి. మన ఆంధ్రదేశంలో విశాఖపట్టణం హైదరాబాద్‌లలోని జూలు అత్యంత ఆధునికమైనవి. మద్రాస్ లోని పాత జూకి బదులు గిండిలో కొత్తది ఏర్పడింది.

భువనేశ్వర్ వద్ద నందన్ కానన్ జూ చాలా ప్రసిద్ధమైంది. ఈనాడు మొత్తం మనదేశంలో 25-30 జూ పార్క్‌లు ఉన్నాయి.

పాతకాలం నాటి జూలలోని జంతువులకు నరకయాతనగా ఉండేది. అవి విశాల అటవీ ప్రాంతాల్లో నివసించేవి. కేవలం కొద్ది చదరపు మీటల వైశాల్యం కల బోనుల్లో ఉండటం కష్టం. నిత్యం అందరూ వచ్చి వాటిని గమనిస్తూంటే జంతువులకు మానసికాందోళన కలుగుతుంది.

అమెరికాలో ఒక సంఘం ఈ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి ఇలాంటి పరిస్థితుల్లో పశుపక్ష్యాదులు తమ సహజ సిద్ధమైన జీవన విధానాన్ని గడపలేవని కనుక్కొన్నారు.. వాటికి పిచ్చిపట్టినట్లవుతుందని నిర్ధరించారు.

మానవుడికి జంతువులకి అనేక లక్షణాలలో భావసామ్యం కనబడుతుంది. ఖైదీలుగా ఏళ్ళ తరబడి ఉంచితే మనిషిలో మానసిక పరిణామాలు ఎలా ఉంటాయో దాదాపు అదే పద్ధతిలో వీటి మానసిక పరిణామాలు ఉంటాయి. అందువల్ల ఆధునిక జూలలో వీటికి అనుకూల వాతావరణాలు కల్పిస్తున్నారు.

సఫారీ పార్కులు ఏర్పడ్డాయి. జంతువులు విశాల ప్రాంతాలలో విహారం చేస్తూ ఉంటే బోనులు లాంటి బస్సుల్లో పోయి వాటిని తిలకించడం అలవాటయింది. పక్షులు పెద్ద పెద్ద మెష్‌లు ఏర్పరచిన ఆవరణల్లో ఉంటే ప్రేక్షకులు వాటిని సహజ వాతావరణంలో చూసి ఆనందించగల్గుతున్నారు. రాత్రిపూటల్లో సంచరించేవాటికి తగిన వాతావరణం కల్పించి పగలు, రాత్రి పరిస్థితులు కల్పిస్తారు. అంటే రాత్రిపూట విశ్రమిస్తాయి. పగటి పూట (చీకటిగా ఉండడంవల్ల) సంచరిస్తాయి కాబట్టి మనం చూడగలుగుతాము.

కొన్నిటిని జూలలోకి తీసుకొచ్చి వాటికి తగిన రక్షణ సంతానోత్పత్తి అవకాశాలు కల్పించాలి వాటి సంతానం క్రమంగా అధికంగా చేసి తిరిగి వాటిని తమతమ సహజవాతావరణంలోకి పంపగలగాలి. ఉదాహరణకి మన దేశంలోని మూడు మొసళ్ళ జాతులు అంతరించిపోయే ప్రమాదంలో పడ్డాయి. వాటిని ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్ (విశాఖ), నెహ్రూ జూలాజికల్ పార్క్ (హైదరాబాద్) ఇంకా అనేక చోట్ల పెంచి అధిక సంఖ్యలో గుడ్లను సేకరించి పిల్లల్ని చేసి తిరిగి పాపికొండలు, కోరంగి ప్రాంతాల్లో విడుదల చేస్తున్నారు. అదే విధంగా చైనాలోని జయంట్ పండాకు జూ తప్ప వేరే శరణ్యంలేదు.

సహజ వాతావరణంలో ఉంటే అవి మరణిస్తాయి.

కొన్ని జూ పార్క్‌లు ప్రత్యేకత కలిగి ఉంటాయి. టోక్యోలో సీతాకోకచిలుకలకే ప్రత్యేకంగా ఒక జూ, సింగపూర్‌లో కేవలం పక్షులకే ఒక జూ ఉన్నాయి.

నిజానికి జూలలోని జంతువులు ఇప్పుడు అడవుల్లోని జంతువులన్నీ ఎంత హాయిగా బ్రతుకుతున్నాయి. వాటికోసం ప్రత్యేకమయిన వాతావరణాన్ని కృత్రిమంగా దానికి అనువయినట్లుగా, దానికి సరిపడే ప్రదేశంలో సృష్టించి, ఆ ప్రదేశందాటి అది బయటికి వెళ్ళకుండా ఉండటానికి చుట్టూ గోడకట్టిన ఎన్ క్లోజర్స్‌లో ఉంచుతారు. వీటిని మోటెడ్ ఎన్ క్లోజర్స్ అంటారు. ఇందువల్ల వాటి స్వేచ్ఛకి ఏ మాత్రం హాని జరగదు.

అడవుల్లోని జంతువులు కూడా అడవి మొత్తం తిరగవు. ప్రతీ ఒక మృగానికి అది తిరిగే ఓ నిర్ణీత ప్రదేశం ఉంటుంది. ఆ ప్రదేశం వదిలి అది బయటకి వెళ్ళదు. ఇంకో మృగాన్ని ఆ పరిధిలోకి రానివ్వదు.

అడవుల్లోని జంతువుల జీవిత పరిమాణం కంటే జూలోని జంతువుల ఆయుష్షు అధికం. కారణం వేటాడితేకానీ దానికి ఆహారం దొరకదు. ఒకోసారి రోజుల తరబడి ఆకలితో మాడాల్సి వస్తుంది. జూపార్క్‌లోని జంతువులన్నిటికి దానికి సరిపడే ఆహారం, విటమిన్‌తో సహా దానికేమాత్రం శ్రమలేకుండానే రోజూ అందించబడుతుంది.

అడవుల్లో ఇంకా బలమయిన జంతువులు శత్రువులు వేటగాళ్ళు మొదలయిన రూపాల్లో ప్రమాదాలని అనుక్షణం ఎదుర్కోవాల్సి వస్తుంది. జూ పార్క్‌లలో వాటి భద్రత ఎక్కువ.

అడవుల్లో లభించని వైద్య సహాయం జూలలో లభిస్తుంది. జంతువు పర్యవేక్షలో ఉంటుంది కాబట్టి దానికి వైద్య సౌకర్యం అవసరం అయితే వెంటనే వెటర్నరీ డాక్టర్ చికిత్స చేస్తాడు. ఫ్రాక్చర్ అయిన జంతువుల కాళ్ళకి కట్లు కట్టి నయం చేయడం, ప్రసవం సమయంలో సహాయం చేయడం జబ్బులు రాకుండా ఏంటీబయాటిక్స్ ఇవ్వడంలాంటి అనేక సౌకర్యాలు జూలలో లభ్యమవుతాయి.

ఈ పార్క్‌లు కేవలం వినోదం ఇచ్చే విహారస్థలాలుగా ఉపయోగపడుతున్నా, అవి 'ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్'గా నిర్వహింప బడుతున్నాయి. ప్రజలు కొన్ని వందలమైళ్ళు అడవుల్లో తిరిగినా చూడలేరు. వన్యమృగాలని కొన్ని గంటలలో ఇక్కడ చూడగలరు.

జువాలజిస్టులు వివిధ జంతువుల అలవాట్లని, బ్రీడింగ్ హేబి అనేక ఇతర విషయాల గురించి, తెలుసుకునే అవకాశం ఒక్క పార్కులలోనే తేలికగా సాధ్యమవుతుంది.

ముఖ్యంగా 'ఎన్‌డేంజర్డ్' అంటే, అనేక కారణాలవల్ల సమసిపోతున్న అనేక జంతువులు ఈ పార్క్‌ల ద్వారా పూర్తిగా అదృశ్యం కాకుండా రక్షింపబడుతున్నాయి.

మొసళ్ళని వాటి తోళ్ళకోసం, ఖడ్గమృగాలని వాటి కొమ్ము కోసం విపరీతంగా వేటాడి అవి ఇక భూమి మీద లేకుండా స్థితికి తెచ్చారు వేటగాళ్ళు.

పూలలాగా, రంగుల్లాగా, పక్షుల్లాగా, సువాసనలాగా, జంతువులు కూడా దేముడు మనుషుల కిచ్చిన వరం. వాటిని రక్షించి ముందుతరాల వారికోసం వాటిని భద్రపరచడం మానవులుగా మనందరి బాధ్యత, విధి.

●●●

"మనరాష్ట్రం" దినపత్రికలో ఎప్పటిలా ఎడిటోరియల్ బోర్డ్ మీటింగ్ జరిగింది ఆ బుధవారం కూడా.

రాష్ట్ర, కేంద్ర రాజకీయాల మీద, రాజకీయ పార్టీమీద తాము అనుసరించాల్సిన పాలసీని ఆ మీటింగ్‌లో చర్చించి డిసైడ్ చేస్తూంటారు.

ప్రస్తుతం హాట్ న్యూస్ అయిన పులుల విషయంలో ప్రభుత్వ వైఫల్యం ఉందా లేదా అని చర్చించి, ఉందని నిర్ణయించారు. మర్నాటి ఎడిటోరియల్ ఆ విషయం మీద రాయాలని కూడా నిర్ణయించారు.

నగరంలో స్వేచ్ఛగా తిరుగుతున్న ఆ క్రూరమృగాల్లో దేన్నయినా ప్రాణాలతో పట్టుకోడానికి సహాయం చేసిన వారికి లేదా చంపిన వారికి వెయ్యిరూపాయలు బహుమతిని తమ పేపర్ తరఫున ప్రకటించాలన్న నిర్ణయం కూడా తీసుకున్నారు.

●●●

పోలీస్ కంట్రోల్ రూంలోని గోడమీద విశాలమైన జంటనగరాల మేప్ ఉంది. పెద్ద వీధులేకాక ముఖ్యమయిన చిన్న వీధులు కూడా వీటిలో గుర్తుంచి ఉన్నాయి.

వాటిలో అక్కడక్కడ పోలీస్ స్టేషన్స్, పోస్టు ఆఫీసులు గుర్తించి ఉన్నాయి. ఆ మేప్ మీద ఎర్రరంగు పసుపు పచ్చ, తెల్లరంగు డ్రాయింగ్ పిన్స్ అక్కడక్కడ గుచ్చి ఉన్నాయి.

ఆ గదిలో ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్ డ్యూటీలో ఉన్నారు. నగరంలో ఏ ప్రాంతంలోనయినా పులి కనబడిందన్న వార్త అందితే ఆ ప్రాంతంలో పసుపు పచ్చ డ్రాయింగ్ పిన్‌ని గుచ్చుతున్నారు.

నలుగురయిదుగురుద్వారా నిజంగా పులి ఉందని కన్‌ఫర్మ్‌డ్‌గా వార్త అందితే ఆ పసుపుపచ్చ పిన్‌ని తీసి ఎర్రరంగు పిన్నుని గుచ్చుతున్నారు.

ఎర్రరంగు పిన్ ప్రాంతంలో మళ్ళీ పులిగురించిన సమాచారం పన్నెండు గంటల్లో తెలీకపోతే ఎర్రరంగు పిన్ తీసి తెల్లరంగు పిన్ ఆ స్థానంలో గుచ్చుతున్నారు. ఆ విధంగా నగరంలో ఏ ఏ ప్రాంతాల్లో పులుల సంచారం ఉందో ఎప్పటికప్పుడు ఆ మేప్ ద్వారా తెలుసుకోవచ్చు.

ఫోన్ మోగింది. మేప్ రూంలో రిసీవర్ అందుకున్న కానిస్టేబుల్ ఏం మాట్లాడకుండా వినసాగాడు.

అది కంట్రోలు ఫోన్ నంబరు ఎక్స్‌టెన్షన్.

"హలో. కంట్రోల్ రూం" వినిపించింది.

"నేను ఆర్ట్స్ కాలేజీనుంచి మాట్లాడుతున్నాను. ఇప్పుడే ఓ పులిని చూసానిక్కడ" ఆత్రంగా వినిపించిందో కంఠం.

"ఎలా ఉందది?"

"పూర్తిగా నల్లగా ఉంది. పెద్ద పిల్లిలా ఉంది."

"సరే. థాంక్స్."

ఫోన్ పెట్టేసారు కంట్రోలు రూంలో మేప్ రూంలోని ఆ కానిస్టేబుల్ కూడా ఫోన్ పెట్టేసి పసుపురంగు డ్రాయింగ్ పిన్ అందుకుని ఆర్ట్స్ కాలేజీ ప్రాంతంలో దాన్ని గుచ్చాడు.

కంట్రోల్ రూం నుంచి వైర్‌లెస్ ఫోన్ ద్వారా విద్యానగర్‌లోని పోలీస్ పెట్రోల్ కారుకి ఆ సమాచారం పంపారు. ఇరవై నిముషాల తరువాత ఆ కారునుంచి సమాచారం వచ్చింది.

ఒక్కరు కాదు. చాలామంది ఆర్ట్స్ కాలేజీ పక్కన ఉన్న ఓ చెట్టుమీద పడుకునివున్న ఆ జాగర్‌ని చూసారు. కానీ ఇప్పుడది అక్కడ లేదు ఓ కుక్క కళేబరం దగ్గర్లో కనిపించింది. అది ఆ జాగార్ పనే అయుండాలి.

ఆ సమాచారం తెలీగానే ఆ కానిస్టేబులు ఆర్ట్స్ కాలేజీ దగ్గర ఇందాక ఉంచిన పసుపుపచ్చ డ్రాయింగ్ పిన్ తీసి అక్కడ ఎర్రరంగు గుచ్చాడు.

ఆ సమాచారం రొటీన్‌గా నెహ్రూ జూ పార్క్‌కి కూడా తెలియచేయబడింది.

పులులు తిరిగే హెచ్చరిక ప్రాంతాలని గంట గంటకీ ఆలిండియా రేడియోకి కంట్రోల్ రూంలోంచి ఫోన్ చేసి చెప్తున్నారు. మలక్ పేట్ అలాంటి హెచ్చరిక ప్రాంతాల్లో కూడా ఉంది.

క్రమంగా చీకటి పడుతోంది. మనుషులు నిద్రపోయి, మృగాలు విహారం చేసే సమయం ఆసన్నమవుతోంది. అంతదాకా ఒక్క క్రూరమృగం ప్రాణాలతో పట్టుబడలేదు. కేవలం చీతా మాత్రమే మరణించింది.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

Post your comments